# అడల్ట్స్ ఓన్లీ కథ




# అనుభవం

తూర్పున వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి. విశ్వం ఇంకా వదలని నిద్రమత్తులో ఆవలిస్తూ పడక గదిలో తూర్పువేపు కిటికీ తలుపులు తెరిచి నారింజ పండులాగా మెరుస్తున్న సూర్యుడికి నమస్కరించాడు.

సూర్యనమస్కారంతో దిన చర్య ప్రారంభించడం అతని బామ్మ అతనికి చిన్నతనంలోనే నేర్పింది. యధాలాపంగా పక్క డాబాకేసి చూశాడు. ఖాళీగా ఉంది. రెండేళ్ళ నుండి సూర్యుడితోపాటే దర్శనమిచ్చే నల్లగా పొట్టిగా ఉండి యోగాసనాలు వేసే కుర్రాడు గానీ, చేతిలో వాక్‌మన్‌తో పచార్లు చేసే తెల్లటి పొడుగబ్బాయి కాని అక్కడ కనిపించలేదు. వాళ్ళలో వాక్‌మన్ కుర్రాడిని విశ్వేశ్వర్రావు బామ్మ ఒకసారి ఆ డాబాకి అవతలి వేపున ఉన్న తన నేస్తం భాగీరథమ్మ గారిని కాస్త పిలవమని పెద్దగా అరిచి, వినిపించలేదేమోనని సంజ్ఞలు చేసి మరీ అడిగితే అతని నుండి ప్రతిస్పందన లేకపోగా తల ఊగిస్తూ ఆనందసాగరంలో తేలుతున్న అతన్ని చూస్తే ఆవిడకి ఒళ్ళు మండింది. 'వీడికి రోజూ ఆ వైర్లు చెవుల్లో పెట్టుకుంటేనే కానీ అవదే మిట్రా?' అని విసుక్కుంది.

బహుశా గది ఖాళీ చేశారేమోననుకుంటూ వెనక్కి తిరగబోయాడు. హఠాత్తుగా కళ్లముందు మెరుపు కొట్టినట్టయింది. నిశ్చేష్టుడై అలాగే చూస్తూ ఉండిపోయాడు. మెరుపు తీగలాంటి ఒక అమ్మాయి ఆ డాబా మీద బట్టలు ఆరేస్తోంది.

ఆడవాళ్ళ అందాలు పరిశీలించడం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్న విశ్వానికి ఆమె అందం కళ్ళు మిరుమిట్లు గొలిపింది. అందంగా, పొంకంగా ఉన్న ఆమె శరీరం, అందమైన ఆమె కదలికలు అలా చూస్తూండిపోయాడు. అతన్ని గమనించని ఆమె తన పని పూర్తి కాగానే క్రిందికి వెళ్ళిపోయింది. నీరసంగా కిటికీ దగ్గర్నుండి కదిలాడు విశ్వం.



అంతమాత్రం చేత విశ్వాన్ని అల్లరి చిల్లరిగా ఆడవాళ్ళ వెంట తిరిగే పోకిరీ మనిషి అనుకోవడం పొరపాటే! ఆ మాటకొస్తే మూడు నెలల క్రితం వరకు బామ్మ కాక మరే స్త్రీ ఉనికీ అతను పట్టించుకునేవాడు కాదు. ఒంటి చేత్తో మగదక్షత లేకుండా అతన్ని పెంచిన బామ్మగారి పెంపకం అలాంటిది.

బామ్మగారి ఒక్కగానొక్క కొడుక్కి ఎంతో కాలానికి, ఎన్నో నోముల పంటగా అనేక తీర్థాలు తిరగ్గా విశ్వం అనబడే ఈ విశ్వేశ్వర్రావు కాశీ వెళ్ళి రాగానే పుట్టాడట. అందుకే బామ్మ పట్టుపట్టి కాశీ విశ్వనాథుని పేరు కాస్త మార్చి తన భర్త పేరు కలిసి వచ్చేట్టు విశ్వేశ్వర్రావు అని నామకరణం చేయించింది. తర్వాతి కాలంలో ఆ పేరే పరిచయస్తులకి స్నేహితులకి, బంధువులకి

**గీత**

**శృంగార కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన రచన**

'విశ్వ'గా, బామ్మకి ముద్దొచ్చినప్పుడు 'విస్సు'గా కోపంగా ఉన్నప్పుడు 'విస్సిగాడిలా' రూపాంతరం చెందింది.

చిన్న పల్లెటూరిలో పొలాలు, తోటలు, దొడ్లు ఉన్న కలిగిన ఆసామిగా పేరు పడ్డ విశ్వం తండ్రికి మాత్రం అతని ముద్దు ముచ్చటలు చూసుకునే యోగం లేకపోయింది. పొలం గట్టు వివాదాల్లో దాయాదులు ఆయన తల పగలగొట్టి చంపేశారు. తల్లి దిగులుతో మంచం పట్టి భర్తను చేరుకుంది. ఒంటరిదైన బామ్మ మనవడికి ఆ దాయాదుల వలన ప్రాణహాని ఉందని పసిగట్టి, ఎలాగూ కుర్రాడి పై చదువులకి పట్నం రావల్సిందే కాబట్టి పొలం, పుట్రా ఆ ఊళ్ళోనే ఉంటున్న విశ్వం వేలు విడిచిన మేనమామకి అప్పగించి, మనవడితో విజయవాడలో ఇల్లు కొనుక్కుని స్థిరపడింది. నాట్ల



సమయంలో, శిస్తు వసూళ్ళకి తను వెళ్ళడం తప్ప మనవడికి ఆ ఊరితో సంబంధం లేకుండా కట్టు దిట్టం చేసి ఊపిరి పీల్చుకుంది. అప్పట్నించి తల్లి, తండ్రి తనే అయి మనవడిని కళ్ళల్లో పెట్టుకుని పెంచింది. విశ్వం కూడా బామ్మ మాటని మన్నిస్తూ బాధ్యతగానే ఉంటూ వచ్చాడు. విశ్వం తన పట్టులోంచి జారిపోకుండా ఉండడానికి ఆమె మొదటి నుండి జాగ్రత్తపడుతూనే వచ్చింది.

స్వతహాగా తెలివైన వాడవడం వలన మరో వ్యాపకమేదీ లేకపోవడం చేత విశ్వం చదువే తన లక్ష్యంగా ప్రతి క్లాసు మంచిమార్కులతో పాస్ అవుతూ వచ్చాడు. ఇంటర్ తర్వాత అతను ఇంజనీరింగ్ చదవాలని కాస్త ఉబలాటపడ్డాడు కాని, మనవడిని పై ఊళ్ళో ఎక్కడో హాస్టల్లోనో విడిగా గదిలోనో ఉంచడం ఇష్టంలేక అవసరం వచ్చినప్పుడల్లా తమ పల్లెకు వెళ్ళేందుకు వీలుగా దగ్గరగా ఉన్న విజయవాడ విడిచి, తను మనవడితో ఎక్కడో కాపరం పెట్టడం కుదరని పని అని, అన్నింటికీ మించి ఇంజనీరైతే విశ్వం విదేశాలకి వెళ్ళే ప్రమాదం ఉంటుందని గ్రహించిన బామ్మ అతని ఆశలని నీరు కార్చేసి, ఊళ్ళోనే మిషనరీ మగపిల్లల కాలేజీలో బికాంలో చేర్పించింది. తన దగ్గరికి కాలక్షేపానికి వచ్చే ఇరుగుపొరుగు అమ్మలక్కల వల్ల అతని చదువుకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా డాబా మీద ఒక గది కట్టించి అతనికి కేటాయించింది.

చుట్టుపక్కల అంతా ముసలి ముతక, చిన్న పిల్లలు తప్పించి ఈడొచ్చిన ఆడపిల్లలెవరూ లేరు. అంచేత మేడ మీద అతనొక్కడే ఉన్నా ఎలాంటి భయం లేదని తేల్చుకున్న తరువాతే ఆ డాబాని గదితో సహా మనవడి పరం చేసింది .బామ్మ. వంటల్లో కూడా ఉప్పు, కారం తగ్గించి చదువు తప్ప మరో ధ్యాస అతనికి రాకుండా జాగ్రత్తపడింది. క్లాసులు అవగానే సరాసరి ఇంటికే రావడం చిన్నప్పటి నుంచి అలవాటు కాబట్టి విశ్వానికి సినిమాలు, హోటళ్లు, బాతాఖానీలు అలవాటు కాలేదు. ఉన్న చాలా కొంతమంది స్నేహితులూ అతని ఇంటికి వచ్చేవాళ్ళు కాదు. దానికి కారణం మెత్తగా మాట్లాడుతూనే చురకలంటించే బామ్మగారి నోరు. బామ్మ మనసుని నొప్పించలేకపోవడం విశ్వానికి ఉన్న ఒకే ఒక బలహీనత.

విశ్వం బి.కాం. ఫస్ట్ క్లాసులో పాస్ అవడమే కాక ఒక జాతీయ బాంక్‌లో ఉద్యోగం కూడా సంపాదించుకున్నాడు. వెంట వెంటనే బాంక్ పరీక్షలు పూర్తి చేసి ప్రమోషనూ సంపాదించేశాడు. ఇతరత్రా చాలా నెమ్మదిగా ఉండే విశ్వం బాంక్ వ్యవహారాల్లో పులే! బాంక్‌కి సంబంధించిన లావాదేవీలు, రూల్స్ అతని నాలుక చివరే ఉంటాయని ప్రతీతి.

అలా మూడు స్కీములు, ఆరు లెడ్జర్లుగా వాలు గాలిలో పడవ లాగా సాగిపోతున్న అతని జీవితంలోకి మూడు నెలల క్రితం హఠాత్తుగా పెళ్ళి అనే తుపాన్ ముంచుకొచ్చి, అతని మనశ్శాంతిని తినేసి అతన్ని అతలాకుతలం చేసేసింది.

బామ్మగారికి ఈమధ్య కాస్త ఆరోగ్యం చెడడంతో పాతికేళ్ళ విశ్వానికి పెళ్ళి వయసు, తనకి బతికి బట్టకట్టే వయసు దాటి పోతున్నాయని బెంగ పట్టుకుంది. తన చివరి బాధ్యతగా తెలివి, చదువు, లౌక్యం ఉన్న పిల్ల చేతిలో విశ్వాన్ని, అతని ఆస్తిని పెట్టేసి నిశ్చింతగా ఊపిరి వదిలేద్దామని నిర్ణయించుకుని, దగ్గర్లోని మరో పల్లెలో ఉన్న మోతుబరి ఆసామి కూతురు పోస్టుగ్రాడ్యుయేషన్ చేసింది. అన్ని విధాలా విశ్వానికి తగిన పిల్లనుకుని, పెళ్ళిచూపులు కూడా ఏర్పాటు చేసేసింది. పెళ్ళి గురించి విశ్వం పెద్దగా ఎప్పుడూ ఆలోచించలేదు. నీకు నచ్చితే నాకు నచ్చినట్టేనని బాధ్యత బామ్మ మీద పెట్టేసి తప్పుకో చూశాడు కానీ బామ్మ మనవడి అమాయకత్వానికి భళ్ళున నవ్వేసి ''తిక్క సన్నాసీ! బాగానే ఉందిరా! జీవితాంతం కలిసి ఉండాల్సిన వాళ్ళు ఒకసారైనా చూసుకపోతే ఎలా? నువ్వు చూడకపోయినా ఆ అమ్మాయికి నిన్ను చూడాలని ఉండదూ? ఫోటోల్ని నమ్మడానికి లేదు. కోతుల్ని రంభలుగా, తారు డబ్బాలని, సున్నం పిడతల్లాగా చూపించగలవు. నువ్వు పిల్లని చూసి తీరాల్సిందే!'' అంటూ అతన్ని పెళ్ళి చూపులకు ప్రయాణం కట్టించింది.

## సునీల్‌తో ఛార్మి!

**హా**స్యనటుడు సునీల్ 'అందాల రాముడు' సినిమాతో హీరోగా కూడా పాపులర్ అయ్యాడు కదా! దీంతో సునీల్ హీరోగా సినిమాలు తీద్దామని చాలా మంది నిర్మాతలు ముందుకు వస్తున్నారు. కానీ హీరోయిన్‌గా నటించడానికి కాస్త పేరున్న హీరోయిన్లు మాత్రం అంతగా కనిపించడం లేని ఈ టైంలో చార్మి మాత్రం తనకు తాను సునీల్‌కి జంటగా నటించడానికి రెడీ అని ముందుకొచ్చిందిట. సునీల్-ఛార్మి జంటగా ఓ సినిమా త్వరలో నిర్మాణం కావచ్చని టాలీవుడ్ వర్గాల కథనం. ఇదే నిజమైతే ఈ సినిమాకి కూడా మంచి క్రేజ్ ఏర్పడడం ఖాయం.

అక్కడ పెళ్ళికూతురి స్నేహబృందమే కాక, పెళ్ళికొడుకుని చూడాలనే కుతూహలంతో గుమి కూడిన ఇరుగుపొరుగు ఆడవాళ్ళతో పెద్ద గుంపే తయారయింది. అప్పటివరకు అసలు ఒక్క ఆడదాన్నే పరిశీలనగా చూడని విశ్వం ఒక్కసారిగా అంత మందిని చూసి గాభరా పడిపోయాడు. బామ్మ అతని చెవిలో ఎర్రంచు పచ్చ చీర పిల్ల పెళ్ళి కూతురని గుసగుసగా చెప్పినా, అతనికి అందరూ ఒక్కలాగే కనబడి మతిపోయినంత పనైంది. ఆ అమ్మాయిని వెతికే ప్రయత్నంలో అతని ఒక్క చూపునకు చాలా తూపుల్లాంటి చూపులు ఎదురై అతన్ని బాగా కంగారుపెట్టేశాయి. ఇంక లాభం లేదని బామ్మ నిర్ణయం మీద భరోసాతో ఆ కాసేపు ముళ్ళ మీదున్నట్టు గడిపి బయట పడ్డాడు. అయితే ఆ అమ్మాయిని అందరూ 'మోహనా!' అని పిలవడం విని 'పేరు చాలా బావుంది' అనుకున్నాడు. తరువాత పెళ్ళి కూతురి ఫోటో అడగాలని అతని మనసులో ఏ మూలో అనిపించినా మొహమాటపడి ఊరుకున్నాడు. మూడు నెలల తరువాత ముహూర్తం కూడా నిర్ణయమైపోయింది. ఆ తర్వాత బాంక్‌లో కొత్త స్కీముల ప్రతిపాదనలో తలమునకలుగా ఉన్నందున విశ్వం మనసులో పెళ్ళి గురించిన ఆలోచన అడుగున పడిపోయింది. కాని చుట్టుపక్కల వాళ్ళు ఊరుకోలేదు.

''విశ్వంగారూ! మీరు ఇలా బేంకే లోకంగా ఉంటే ఆ వచ్చే విశాలాక్షిగారు ఎలా వేగుతారో?'' తోటి ఉద్యోగిని చనువు తీసుకుని అంది.

''విశ్వం! నువ్వు ఇంకా ఇలా ఉంటే కుదర్దోయ్! పెళ్ళి అవబోతోంది కదా! బాగా మారాలి. లేకపోతే లాభం లేదు'' సీనియర్ మల్లిఖార్జునరావు భయపెట్టాడు. ఏం మారాలో విశ్వానికి అర్థం కాలేదు. ఆ మాటే తన స్నేహితుల దగ్గర అన్నాడు.

''అవున్రా! ఆమె బాగా చదువుకుంది అంటున్నావు. నువ్వు ఇలా దద్దోజనంలా ఉంటే లెక్క చేస్తుందా? బయటి ప్రపంచంలోకి వచ్చి కాస్త లోకం పోకడ చూడకపోతే లాభం లేదు'' అని వాళ్ళు కూడా అనడంతో అతనికి కొంచెం భయమేసింది.

''ఏం లోకం పోకడరా?'' అయోమయంగా అడిగాడు. వాళ్ళు వివరించారు.

''అదేరా! ఆడవాళ్ళ ఇష్టాఇష్టాలు ఏమిటో, వాళ్ళని ఎలా తృప్తిపరచాలో, వాళ్ళతో ఎలా ప్రవర్తించాలో, ఇలాంటివి''

''ఇప్పుడవన్నీ లేకపోతేనేం? పెళ్ళైతే తెలీదూ?''

''ఆడదాని మీద అన్ని విషయాల్లోనూ ముఖ్యంగా శృంగారంలో పై చెయ్యిగా లేకపోతే చివరి వరకు ఫలానా ఆమె మొగుడుగానే మిగిలిపోతావ్. నువ్వేమో మరీ ప్రవరాఖ్యుడి అన్నగారిలా పెరిగావ్. అందుకే ముందే అనుభవం సంపాదిస్తే ఆడది వచ్చినట్టు లొంగి ఉంటుంది'' వాళ్ళ మాటల్లో కూడా నిజం వున్నట్టనిపించింది విశ్వానికి. కానీ ఆ అనుభవం ఎలా వస్తుంది?

అతని స్నేహితులు వైవాహిక జీవితానికి సంబంధించిన పుస్తకాలు అతనికిచ్చి చదవమన్నారు. చిన్నప్పటినుండి క్లాసు పుస్తకాలు తప్ప న్యూస్‌పేపర్ కూడా చదవని విశ్వానికి ఆ పుస్తకాలు చదువుదామని తెరిచినప్పుడల్లా ఆవలింతలు, నిద్ర ముంచుకొచ్చేవి. టీ త్రాగి మేలుకుని చదవబోతే తలనొప్పి పట్టుకుంది కాని ఒక్క పేజీ కూడా నడవలేదు. ఇలా కాదని అతని స్నేహితులు విశ్వాన్ని ఒక్క ఘాటయిన సినిమాకి తీసుకెళ్ళారు. అన్నప్రాశన రోజే ఆవకాయ తిన్నవాడిలాగా అయింది విశ్వం పరిస్థితి. తరువాత శృంగారం పాలు అధికంగా ఉన్న మామూలు సినిమాలు చూపించారు. దాంతో విశ్వం కొంచెం దారిలో పడ్డాడు. అతనిలో అంతర్నేత్రం తెరుచుకుంది. అంతవరకు అణిగి ఉన్న అతనిలోని మరోవిశ్వం విశ్వరూపం దాల్చాడు.



ఆడవాళ్ళ అందచందాలు గమనించిన కొద్దీ అతనికి ఆశ్చర్యంగా ఉండేది. ముఖ్యంగా అంత పొడుగాటి చీర అంత ఒద్దికగా ఎలా ఒదిగిపోతుందో అతనికి చాలా అబ్బురంగా అనిపించేది. బొడ్డు దగ్గర మొదలై పాయలుగా చీలిపోయి పాదాల దగ్గరికి చేరే చీర కుచ్చెళ్ళు ఎన్నిసార్లు చూసినా అద్భుతంగా ఉండేది. అందంగా పొందికగా చీర కట్టిన ప్రతి స్త్రీ అతని దృష్టిలో ఒక కళాకారిణే! అయితే ఎన్ని సినిమాలు చూసినా ఆడది అర్థం అయీ అవనట్టుండి అతని అజ్ఞానం మాత్రం అలాగే ఉండిపోయింది.

## బాబోయ్ మీరా చోప్రా!

**ముంబాయి ముద్దుగుమ్మ మీరా చోప్రా 'బంగారం' సినిమాతో పరిచయం అయింది. ఆమె రెండో తెలుగు సినిమా 'సత్యం శివం సుందరం'. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్ కాస్తా మీరా పుణ్యమాని వాయిదా పడిందిప్పుడు. తనకి పారితోషికాన్ని పూర్తిగా చెల్లించలేదని మిగతా సొమ్మంతా నిర్మాత వెంటనే ఇవ్వాలని కోర్టులో మీరా కేసు వేయడంతో ఆ సినిమా విడుదలని కోర్టు నిలుపుదల చేసింది. ఈ కేసు ఎటు తేలుతుందనే సంగతి అలా వుంచితే, ఇకపై ఆమెతో సినిమాలు తీయడానికి నిర్మాతలు ఎవరైనా సాహసం చేస్తారాని?**

ఒక్క థియరీ తెలిస్తే చాలదని దానికి ప్రాక్టికల్స్ కూడా తోడైతే గాని విజ్ఞాన సముపార్జన పూర్తి కాదని అతని స్నేహితులు సలహా ఇచ్చారు. వాళ్ళ ప్రోద్బలం మీద హైక్లాస్ కాల్‌గరల్స్ దొరికే హోటళ్ళకు వెళ్ళాడు ఒకటి రెండుసార్లు. ఇంకా ముందుకి వెళ్ళాలని ప్రయత్నించి కూడా తెలిసిన వాళ్ళెవరి కంటయినా పడితే పరువుపోతుందని, జబ్బులు కూడా అంటుకుంటాయేమోనని భయపడి అటువంటి ప్రయత్నాలు విరమించాడు. ఎలాగైనా ఈ వ్యవహారం అంతు చూడాలని అతనిలో పట్టుదల పెరిగింది. క్షేమకరమైన మరో మార్గం చూడాలని నిర్ణయించాడు. పెళ్ళి నెలరోజుల్లోకి వచ్చింది. అలాంటి సమయంలో శిస్తు వసూళ్ళకి, పనిలో పనిగా పెళ్ళి పనులకి బామ్మ వాళ్ళ ఊరు వెళ్ళింది. పని కాలేదని, రావడానికి మరో వారం పట్టొచ్చని ఫోను చేసింది. ఆమె

వచ్చేలోగానే ప్రాక్టికల్స్ ముగించాలని ఉన్నా ఏ దారీ కనిపించక కొట్టుమిట్టాడుతున్న విశ్వానికి ఎడారిలో ఒయాసిస్సులాగా ఈ మెరుపుతీగ కనిపించి అతని ఆశాదీపాన్ని మళ్ళీ ప్రకాశవంతం చేసింది. ఏమాత్రం కంగారుపడకుండా ఆమెని బాగా పరిశీలించి ముందుకి సాగాలని నిశ్చయించుకున్నాడు.

భాగీరథమ్మగారి మనవడు, మనవరాలు ఎక్కువ సమయం ఆమె గదిలో గడపడం గమనించాడు విశ్వం. అతనికి ఒక దారి దొరికినట్టైంది. వాళ్ళతో భాగీరథమ్మగారు భోజనం, టిఫిన్, కాఫీ పంపినప్పుడు వాళ్ళకి చాక్లెట్లు, బిస్కట్లు, బొమ్మలు ఇచ్చి మచ్చిక చేసుకుని ఆమె వివరాలు సేకరించాడు. ఆమె పేరు ప్రియ అని, కంప్యూటర్‌లో ఏదో క్రాష్ కోర్సు చేయడానికి వచ్చిందని, ఆ ఇంటి వాళ్ళు ఆమెకి తెలిసిన వాళ్ళు కాబట్టి ఆ గదిలో అద్దెకి దిగిందిట. ప్రొద్దున్న రెండు గంటలు క్లాసుకి వెళ్ళి మిగతా సమయంలో ఇంట్లోని కంప్యూటర్ మీద ఏదో పని చేసుకుంటుందిట. ప్రియక్క చాలా మంచిదని, మంచి కథలు చెప్తుందని పిల్లలు ఆమెని మెచ్చుకున్నారు. వచ్చిన పని కాగానే వెళ్ళబోయిన వాళ్ళని ఆడి వాళ్ళతో కబుర్లు, ఆటలు మొదలుపెట్టి వరసగా నాలుగు రోజులు ఆమె దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశాడు. మూడోరోజు ఆమె పిల్లల్ని చూసి నవ్వి చెయ్యి ఊపింది. రోజంతా ఆమెకి ఏం తోచడం లేదని తెలుసుకుని స్నేహితుల సాయంతో సి.డిలు, కాసెట్లు, నవలలు సంపాదించి పిల్లల ద్వారా ఆమెకి పంపించాడు. చుట్టుదారైనా సరే ఆమె ఇంటి ముందు నుంచి బ్యాంక్‌కి వెళ్ళడం మొదలుపెట్టాడు. ఆమె తారసపడి తను పంపినవాటికి కృతజ్ఞతలు చెప్పింది. ఆమె ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళే సమయానికే అతనూ బ్యాంక్‌కి ఆమె ఇంటి దగ్గరి బస్టాపు నుంచి వెళ్ళడం వలన ఆమెని ప్రతిరోజూ కలుసుకునే అవకాశం అతనికి దొరికింది. మొదట్లో ఆమెని చూస్తే అతని గొంతు పెగల్లేదు. ఆమె స్నేహపూరిత స్వభావం, అతని అవసరం కలిసి అతని మొహమాటాన్ని తరిమేశాయి. ఆమెతో మాటలు పొడిగించడానికి విశ్వం టి.వి. చూడ్డం, న్యూస్‌పేపర్ చదవడం మొదలుపెట్టాడు. వాళ్ళ పరిచయం వారం రోజుల్లో చిక్కబడింది. అతని ప్రోగ్రెస్ చూసి అతని స్నేహితులు అభినందించారు. ఎప్పటికప్పుడు వాళ్ళ సలహాలు సంప్రదింపులు అందుతూనే ఉన్నాయి. ఇప్పుడు పిల్లల మధ్యవర్తిత్వం అవసరం లేకుండా డాబాలమీద నుండి ఇద్దరిమధ్య చిరునవ్వులు, చిరు పలకరింపులు సాగుతున్నాయి.

రోజులు దొర్లిపోతున్నాయి. బామ్మ వచ్చే రోజు దగ్గరపడడంతో విశ్వానికి తను చొరవ తీసుకోకపోతే లాభం లేదనిపించింది. ఒకరోజు ఆమె ఒప్పుకుంటుందో లేదో అని జంకుతూనే మర్నాడు సాయంత్రం టీకి తన రూంకి ఆహ్వానించాడు. ఆమె వెంటనే సరేననడంతో అతను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

మర్నాడు శెలవుపెట్టేసి ఇంట్లోనే ఉండిపోయాడు. పొద్దుట టిఫిన్ తెచ్చినప్పుడే పిల్లల ద్వారా తన స్నేహితుడి పుట్టిన రోజని రాత్రి అక్కడే భోజనం చేసి, వచ్చేసరికి పొద్దు పోతుందని భాగీరథమ్మగారికి కబురు చేశాడు. స్వీట్సు, కోక్‌టిన్స్, చిప్స్, మల్లెపూలు కొని ఉంచాడు.

సాయంత్రం స్నానం చేసి ఇస్త్రీలాల్చీ పైజమా వేసుకుని గదిని చేతనైనంత వరకు అందంగా సర్దాడు. రూం ఫ్రెష్నర్ గది నాలుగు వైపులా స్ప్రేచేసి, బాడీ స్ప్రే తన మీద స్ప్రే చేసుకున్నాడు. అయితే అతని అంతరాత్మ మాత్రం పరాయి స్త్రీతో తను అలా ప్రవర్తించడం తప్పని గొణుగుతూనే ఉంది. దాని నస వినిపించకుండా ఏదైనా పాట పాడాలని ప్రయత్నించాడు కానీ సమయానికి ఏ పాటా గుర్తురాలేదు. సి.డి. ప్లేయర్‌లో మంద్రంగా బిస్మిల్లాఖాన్ షెహనాయ్ సంగీతం వస్తోంది.

కొంచెం భయంగా, కొంచెం ఉత్కంఠగా కలగాపులగంగా ఉంది అతని మానసిక స్థితి. ఆమె అసలు రాదేమోననే అనుమానం కూడా మనసు మారుమూల మెదులుతూనే ఉంది.

డాబామీదికి వెళ్ళి రెండు మూడు సార్లు రోడ్డుకేసి చూశాడు. ఆమె జాడ లేదు. బాగా చీకటి పడింది. ఇంక ఆమె రాదని అతను నిశ్చయించుకున్నాడు. జుట్టు పీక్కుని పెద్దగా అరవాలనిపించింది విశ్వానికి. ఆశాభంగం భరించలేక రూంకి తాళం పెట్టి బయటికి వెళ్ళాలని లేవబోతున్నాడు.

అలికిడైతే చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు. తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు. గుమ్మం దగ్గర ఆమె..వెండిదారంతో అందంగా ఉన్న పనితనంతో నీలం చీర, అదే రంగు పొట్టి చేతుల జాకెట్టు, చెవులకి అందంగా ఊగుతున్న చిన్న వజ్రాల జూకాలు, మెడలో పొడుగాటి గొలుసుకి చక్కటి చెక్కుడు పనితో మెరుస్తున్న పెద్ద లాకెట్టు, మెడ మీదికి జారుగా కట్టిన జుట్టులో మల్లెపూలు..నుదుట చిరుగాలికి కదుల్తున్న ముంగురుల మధ్య మెరుపు అంటిన అందమైన



## నాకేం తెలియదు!

**'క్రిష్', 'ధూమ్' హిట్ కావడంతో వాటికి సీక్వెల్స్ తీయాలని నిర్మాతలు ప్లాన్ చేశారు. 'ధూమ్-2' ఆల్రెడీ రిలీజ్ కూడా అయిపోయింది. 'క్రిష్' సీక్వెల్‌లో ఈసారి హృతిక్ సరసన విద్యాబాలన్ నాయికగా నటిస్తుందని కూడా వార్తలు వచ్చాయి. కానీ తాజా సంగతి ఏంటంటే- అసలు 'క్రిష్'కి సీక్వెల్ తీస్తున్న సంగతి తనకి ఇంతవరకూ తెలీదంటున్నాడు హృతిక్. మరి ఆ సినిమాకి దర్శకుడు అతని తండ్రి రాకేష్ రోషన్ కదా, హృతిక్‌కి తెలియకపోవడం ఏంటి? అని అందరికీ డౌటు రావచ్చు. మరి 'విచిత్రం' అంటే అదే! నిజంగానే సీక్వెల్ తీయడం లేదా? లేక ఇది కూడా ఆ సినిమా పబ్లిసిటీ భాగమా?**

నల్లటి బొట్టు. మబ్బు తునకలో తటిల్లతలా ఉంది.

''లోపలికి రానివ్వరా?'' నవ్వుతూ అడిగింది. అతనికి గదిలో ట్యూబ్‌లైట్‌తో పాటు తనలో కూడా ఓల్టేజి పెరిగినట్టుంది.

''రండి! రండి!'' తడబాటుగా అన్నాడు.

ఆమె లోపలికి వచ్చింది.

''కూర్చోండి!'' అతని గొంతు అతనికే వినిపించలేదు. ఆమె కుర్చీలో కూర్చొని గది అంతా కలయచూసింది.

''గది చాలా నీట్‌గా పెట్టుకున్నారే! రోజూ ఇలాగే సువాసనలు గుబాళిస్తుంటాయా?'' ఆమె నవ్వింది. ఆమె అలా నవ్వినప్పుడల్లా అతనిలో నరాగలు తెగిపోయాయా అన్నంత టెన్షన్.

ఇలాంటి సమయాల్లో ఏం మాట్లాడాలో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాడు కాని అతని మెదడు సంకేతాలన్నీ అతని కళ్ళకే పంపించడంలో బిజీగా ఉండడంతో మరో ఆలోచనకి అవకాశం లేకపోయింది. ఏదో మాట్లాడాలని ఉన్నా ఏం మాట్లాడాలో అతనికి తెలీలేదు. తలెత్తి ఆమె కేసి చూశాడు.

ఆమె చిరునవ్వుతో అతని వంకే చూస్తోంది.

ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. అతని బి.పి. పెరిగింది. వివశత్వంతో పట్టు తప్పుతున్న గొంతుని అదుపులోకి తెచ్చుకుంటూ,

''సారీ! ఇలా పిల్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టున్నాను'' అన్నాడు.

''ఇబ్బంది పడుతున్నది నేను కాదు మీరే ఏదో అనీజీగా ఉన్నారు'' అంది ఆమె అతన్ని పరిశీలనగా చూస్తూ.

''అబ్బే! అదేం లేదు. అసలు మీరు రారేమోనని నేను చాలా టెన్షన్ పడ్డాను. చివరికి వచ్చారు'' గబగబా ఏదో నోటికి వచ్చింది మాట్లాడుతూ లేచి ప్లేట్లలో అన్నీ సర్ది ఆమెకి ఒకటి అందించి తను మరొకటి తీసుకున్నాడు.

''మీరు భలేవారే! దూరంగా ఉన్నప్పటి చనువు చొరవ దగ్గరకు రాగానే ఎక్కడికిపోయాయి?'' స్వీట్‌ని సుతారంగా కొరుకుతూ అందామె.

విశ్వానికి ఆమె మాటల్లో కవ్వింపు కనిపించింది. అతని వంట్లోంచి వేడి శగలు. ప్లేటు పక్కన పెట్టేసి లేచి వెళ్ళి ఆమెని దాదాపు రాసుకుంటున్నంత దగ్గరగా నిలబడి సి.డి. మార్చసాగాడు. ఆమె దూరంగా జరిగే ప్రయత్నం చేయలేదు. ఆమె తలలోని మల్లెల వాసనా, ఆమె వంటిమీది నుండి తేలి వస్తున్న పరిమళం అతన్ని చుట్టుముట్టి మత్తులో ముంచాయి. అతను హఠాత్తుగా కంపిస్తున్న తన చేతిని ఆమె భుజం మీద వేశాడు.

''మీరు చాలా అందంగా ఉంటారు'' అన్నాడు ఆమె కళ్ళలోకి చూస్తూ.

''ఆ మాట ఇంత దగ్గరగానే చెప్పాలా?'' ఆమె నవ్వింది.

సంశయం, జంకు పటాపంచలయ్యాయి. అతన్ని ఉద్రేకం ముంచెత్తింది. ఎడం చేత్తో ఆమెని చుట్టేసి మంచంవేపు నడిపించాడు. ఆమె నుండి ఎలాంటి ప్రతిఘటనా లేదు.

''భయం వేస్తోందా?'' తన భయం అదుపుచేసుకోవడానికి ప్రయత్నిస్తూ గుసగుసగా అన్నాడు. ఆమె ఏం మాట్లాడలేదు.

విశ్వం ఆమె మొహానికి దగ్గరగా తన మొహం చేర్చి పెదవులు కలపబోయాడు.

ఆమె సుతారంగా అతని మొహాన్ని తప్పించి, ''ఆడపిల్లల్ని పరిచయం చేసుకుని, ఆ కొద్దిపాటి పరిచయంతో రూంకి పిల్చి ఇలా ప్రవర్తించడం మీకు అలవాటా?'' ఆమె గొంతు కొంచెం తీవ్రంగా ఉంది. అతను ఉలిక్కిపాటుతో ఆమెకేసి చూశాడు. ఆమె మొహంలో కదలాడిన భావం అతనికి అర్థంకాకపోయినా అంతవరకు అతన్ని ఆవహించిన భూతం తొలగిపోయినట్టు అయింది. ఉద్రేకం పాలపొంగులా చప్పబడిపోయింది.

''నేను అలాంటివాడిని కాదు. అసలు నేను...'' అతను మాటలు వెతుక్కోవాల్సి వచ్చింది.

''ఎలాంటి వారో తెలుస్తూనే ఉంది. ఇంకా ఏం చెప్తారు? మంచివారిలా పెద్దమనిషిలాగా ఉన్నారని మాట్లాడితే మిమ్మల్ని నమ్మి ఇంటికి వచ్చిన ఆడపిల్లతో ఇలాంటి చిల్లర వేషాలు వేస్తారా? మీకు పెళ్ళి కూడా నిశ్చయమయిందిటగా! నిజమేనా?''

ఆమె ధోరణికి మాటలు రాక అతను మౌనంగా తలాడించాడు.

''మరి ఇదంతా ఏమిటి? తప్పుగా అనిపించడం లేదా?'' అతని మొహం ఎర్రబడింది.

''ఆమెకి నేనేం అన్యాయం చెయ్యాలనుకోలేదు. నాకిలాంటివేం తెలీదు. అందుకని ఎందుకైనా మంచిదని..మా ఫ్రెండ్స్ చెప్తే'' సంజాయిషీలాగా గొణిగాడు.

అతని మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ- ''వినేవాళ్ళుంటే చెప్పేవాళ్ళు లక్ష చెప్తారు. ఎవరేం చెప్పినా ఆలోచించకుండా చేయడానికి మీరు చిన్నపిల్లవాడు కాదుగా! సభ్యత, సంస్కారం, చదువు, సంధ్య ఉన్నవాళ్ళు ప్రవర్తించే తీరు ఇదేనా?''

ఆమె ధోరణికి అతనికి ఒళ్ళు మండింది. 'పుట్టి బుద్ధెరిగిన తర్వాత ఎవరిచేతా ఒక్క మాట కూడా పడని తాను ఈవేళ ఈ పరాయి అమ్మాయికి ఎంత అలుసైపోయాను. బామ్మకంటే ఎక్కువగా నామీద పెత్తనం చేస్తోంది' కసిగా అనుకోబోయాడు. అప్పటివరకు అతనిలో బలహీనంగా మూలుగుతున్న అతని అంతరాత్మ బయటినుండి తనకు సపోర్టు రావడంతో పుంజుకుని...

'నోర్ముయ్యవోయ్! ఆ అమ్మాయిని పాడుచెయ్యాలనుకున్నప్పుడు గుర్తుకి రాలేదా ఆ పరాయితనం? తప్పు చేసింది చాలక ఇంకా నీ మొహానికి కోపం కూడానా?' అని రెచ్చిపోయి సతాయించసాగింది.

అతని మొహం కందగడ్డలాగా అయింది. ఏదో మాట్లాడబోయాడు. ఆమె వినిపించుకోకుండా అతనికేసి సూటిగా చూస్తూ ''అక్కడ మీ కాబోయే భార్యగారు కూడా ఇక్కడ మీరు ఆలోచించినట్టే ఆలోచిస్తే'' అంది అతనికి ఎవరో లాగిపెట్టి గూడమీద కొట్టినట్టైంది. అవాక్కై విస్తుపోతూ ఆమెకేసి చూశాడు.

అతని మొహంలోని దైన్యం ఆమెకి జాలికి కలిగించగా-

''ప్రకృతి సహజంగా తెలిసే దానికి పూర్వానుభవం అవసరమా? ఆలోచించండి'' మృదువుగా అంటూ లేచి నిలబడింది.

''క్షమించండి'' అన్నాడు లోగొంతుతో.

''అలాంటి డైలాగ్స్ ఎందుకులెండి. నేను అలా వెళ్ళగానే మరో అమ్మాయితో మీరు ప్రయోగాలు చెయ్యకపోతే అంతే చాలు'' బయటికి నడుస్తూ అంది.

విశ్వానికి మాయమైపోయే విద్య ఏదైనా తెలిస్తే బావుండుననిపించింది. తల దించుకున్నాడు.

ఆమె తలుపు దగ్గర ఒక్కక్షణం ఆగి వెనక్కి తిరిగి అతనికేసి చూస్తూ-

''ఒక పని చెయ్యండి'' అంది.

''ఇంకా ఏం మిగిలిందిరా బాబూ!'' అనుకుంటూ నిస్సహాయంగా చూశాడు.

''పెళ్ళయ్యే వరకూ మీ కాబోయే శ్రీమతి ఫోటో ఒకటి దగ్గర పెట్టుకుని మీరు చేయాలనుకునే ప్రయోగాల్లోఆమెనే ఊహించుకోండి'' రాబోయే నవ్వుని మునిపంటితో నొక్కిపెట్టి ఆమె మెట్లకేసి కదిలింది. అతను స్థాణువులా నిలబడి ఆమె వెళ్ళడం కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

★ ★ ★

ఆ రాత్రి ఫోనులో ''నాన్నా! బాబాయి ఆయన గురించి విన్నది, చూసింది నిజమే! కానీ ఆ కారణంగా మనం ఈ సంబంధం కాన్సిల్ చెయ్యక్కర్లేదు. ఈ విషయంలో మీకు ఎలాంటి అనుమానం వద్దు. అతనితో నా జీవితం సుఖంగా ఉంటుందని నాకు పూర్తిగా నమ్మకమే! మీరు నామీద ఏ నమ్మకంతో ఇక్కడికి రావడానికి ఒప్పుకున్నారో ఆ నమ్మకంతోనే పెళ్ళి పనులు మొదలుపెట్టండి. ఇక్కడ అన్నయ్య ఫ్రెండ్ మధు, ఆయన ఫామిలీ నన్ను చాలా బాగా చూస్తున్నారు. రేపు నేను మన ఊరు వస్తున్నాను. నా కోర్స్ ఇక్కడ పూర్తయింది'' ఆఖరి మాటలు అంటున్నప్పుడు మోహనప్రియ పెదవులపై అలవోకగా చిరునవ్వు కదలాడింది.

☆